# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 3, ఫిబ్రవరి 2026


# పురపోరులో నిలిచేదెవరు?







- గెలుపు గుర్రాలకే బీఫారం ఇస్తామంటున్న పార్టీ వర్గాలు
- నేడు నామినేషన్ల ఉపసంహరణ
- పార్టీ బీఫారాలు దక్కేదెవరికి..

చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

చెన్నూరు మున్సిపాల్టీలో 18 వార్డులకు గాను వివిధ పార్టీలకు చెందిన 159 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన విషయం విదితమే. ఈరోజు నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు కావడంతో పోటీ దారుల్లో ఉత్కంఠ నెలకొంది.పార్టీల ఆశీస్సులు ఎవరికి ఉంటాయి, బీఫారాలు ఎవరికి వస్తాయి అనే డైలామాలో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో చాలామంది అభ్యర్థులు పోటీచేయడంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆశీస్సులు ఎవరికి ఉంటాయన్న చర్చ మొదలైంది. ఒక్కోవార్డులో ముగ్గురు, నలుగురు నామినేషన్ వేయడంతో ఎవరికి బీ ఫారం ఇస్తాడోనన్న సందేహం చోటుచేసుకుంది. 2లో..

# ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సస్పెండ్



ఆసిఫాబాద్, ప్రభాతవార్త:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి. వినోద పై వచ్చిన సమాచారంపై జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా కళాశాలను సందర్శించిన సమయంలో ప్రిన్సిపాల్ విధులకు గైర్హాజరు కావడం, ప్రిన్సిపల్ కార్యాలయ గదికి తాళం వేసి ఉందని, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో విచారణ జరిపినప్పుడు, ప్రిన్సిపాల్ ఈ నెల 29వ తేదీ నుండి తన చట్టబద్ధమైన విధులకు హాజరు కాలేదని, ఆసిఫాబాద్‌లో లేరని తెలిసిందని ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్లేందుకు ప్రిన్సిపల్ ఎలాంటి ముందస్తు అనుమతి పొందలేదని తెలిపారు. డిసెంబర్ 2025లో విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు విద్యా తరగతులు ప్రారంభించలేదని విద్యార్థులు, అధ్యాపకులచే నిర్ధారించబడిందని, విద్యార్థులు అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఉంటున్నారని, వారికి నాణ్యత లేని ఆహారం అందించబడుతుందని గమనించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులతో శుభ్రపరిచే పనులు, ప్రిన్సిపాల్ వ్యక్తిగత పనులు, వీధి కుక్కలు, పిల్లులకు ఆహారం పెట్టడం, వాటి పోషణ వంటి అంశాలపై ఒత్తిడి తెస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు. విద్యార్థినుల వసతి గృహంలో సి.సి. కెమెరా అమర్చడం జరిగిందని, విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కారణంగా ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేయడం జరిగిందని, క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకు/క్రిమినల్ అభియోగాలకు సంబంధించిన అన్ని చర్యలను ముగించే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కాలంలో ప్రిన్సిపల్ బి.వినోద జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని, ముందస్తు అనుమతి పొందకుండా ప్రధాన కార్యాలయం నుంచి బయటకు వెళ్లకూడదని తెలిపారు.

# మేయర్, ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

* రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



నస్పూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

2వ సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల లతో మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మేయర్ / చైర్మన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నామినేషన్లు స్వీకరించడం జరిగిందని, అభ్యంతరాలు, మిగతా 2లో..

# మహిళల రక్షణే పోలీస్ శాఖ తొలి ప్రాధాన్యత



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

మహిళలు, యువతులు, బాలికలు ఎవరైనా హింసకు గురి అయినట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ నితిక పంత్ సోమవారం తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవీ టీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఏదైనా హింసకు గురి అయినట్లయితే షీ టీంను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరిలో షీటీం ద్వారా 83 హాట్స్పాట్ ప్రదేశాలను గుర్తించామని, 24 అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించామని వివరించారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల భద్రత చర్యలు మిగతా 2లో..




# పురపోరులో నిలిచేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

బీ ఫారాలకోసం కొంతమంది లీడర్లు పార్టీ పెద్దలవద్ద రికమండేషన్ చేస్తున్నారని సమాచారం. ఇక బీఆర్ఎస్,పార్టీ విషయానికి వస్తే నాలుగైదు వార్డుల్లో తప్పా మిగిలిన చోట్ల పార్టీ నిలబెట్టిన అభ్యర్థులే ఉన్నారు. బీజేపీ పార్టీ నుండి పోటీచేసిన అభ్యర్థులు వారికి అదేరోజు హామీ ఇచ్చినట్లు సమాచారం. గెలుపు గుర్రాలకే బీఫారాలు ఇస్తామని అన్నిపార్టీల నాయకులు చెప్పుకొచ్చారు.

# మేయర్, ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరణల అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను తయారు చేయడం జరుగుతుందని, వెంటనే గుర్తుల కేటాయింపు చేసి బ్యాలెట్ పేపర్లను ముద్రణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13 వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మేయర్లు / చైర్మన్ల ఎంపిక ప్రక్రియ లో ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఇందులో భాగంగా ఎంపిక చేయబడిన అధికారులకు ఆన్లైన్ ద్వారా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు 4 మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణ అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు జశ్వంత్, రాజేంద్రప్రసాద్, మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే పోలీస్-శాఖ తొలి ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మహిళలు, పిల్లలు ఇబ్బందులకు గురైతే పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు షీటీంను సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీటీంలు పనిచేస్తున్నాయని, ఆసిఫాబాద్ డివిజన్ షీటీం నెంబర్ 8712670564, కాగజ్నగర్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670565 లేనిపక్షంలో డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## అంబేద్కర్ తండ్రికి ఘన నివాళులు

వాంకిడి ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :

బేద్కర్ తండ్రి, సుబేదార్ రాంజీ సత్పాల్ 113వ వర్ధంతి ని సోమవారం వాంకిడి జేత్వాన్ బుద్ధ విహార్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నాయకులు రాంజీ సత్పాల్ జీవిత చరిత్ర పై మాట్లాడారు.రాంజీ సత్పాల్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సుబేదార్,అప్పటికే ఆయన ఆంగ్ల భాషలో నిష్ణాతులు,బ్రిటిష్ ఆర్మీకి ఉపాధ్యాయులుగా కూడా పని చేయడం వల్ల అంబేద్కర్ ను ఉన్నత చదువులు చదివించడానికి ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకంజే వేయలేదని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ అన్నారు.ఆయన చలువతోనే అంబేద్కర్ ప్రపంచ మేధావిగా అయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దుర్గం దుర్గాజి, ఉపాధ్యక్షులు దుర్గం సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, కార్యదర్శి రోషన్ ఉప్రే, యాదవ సంఘం నాయకుడు,మాజీ ఎంపీటీసీ దేవినేని గొల్లా, అంబేద్కర్ సంఘం నాయకులు రాజేంద్ర ప్రసాద్, విఠల్, రమేష్ మనోజ్ వెంకటి తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలోని తహసిల్దార్, బూత్ స్థాయి అధికారులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. 2002 సంవత్సరం ఓటరు జాబితాలో పేరు ఉండి 2025 ఓటరు జాబితా అదే పేరు ఉండి వారి కుటుంబ సభ్యులు, కూతుర్లు, కుమారుల పేర్లు 2025 జాబితాలో ఉంటే మ్యాపింగ్ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తమ పోలింగ్ కేంద్రం పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని, బిఎల్ఓ, సూపర్ వైజర్లు, తహసిల్దార్లు పర్యవేక్షించాలని, సమగ్ర సవరణపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్లతో భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనమాలను సమీక్షించారు. భూ భారతిలో పట్టా మార్పిడి, విరాసత్ కొరకు వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత, హాజరైన అధికారులు

తెలిపారు. గత రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వెళ్ళి రికార్డులు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. సాదాబైనమా క్రింద వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించాలని, భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనమాల దరఖాస్తులలో పురోగతి సాధించాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా పరిష్కరించి జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దినపత్రికలలో వచ్చే అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక నిఘా

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రసార సాధనాలు, దినపత్రికలలో వచ్చే అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్ ను సందర్శించి రికార్డులు, పత్రికలలో వచ్చే అభ్యర్థుల ప్రచార శీర్షికలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార సభలకు, ర్యాలీలకు, ప్రకటనలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలపై సందేహాలు, అభ్యంతరాలు, పూర్తి వివరాలకు 8328129551 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైజనింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, మీడియా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



పత్రికలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్

# బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్...

**- కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావు**



లెండుగురె శ్యామ్‌కు కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్,ఫిబ్రవరి 2 , ప్రభాతవార్త :

భారత్ రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిర్పూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావు సోమవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ శ్యామ్ రావుకు, అతని అనుచరులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లెండుగురె శ్యామ్‌రావు సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్‌గా, ఆర్ఎస్‌పి ప్రధాన అనుచరుడిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. దీంతో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం పెరిగినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా లెండుగురె శ్యామ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో బహుజనులకు అన్యాయం జరుగుతుందని అందుకే బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకెళ్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతగూడ కోయవాగు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# సర్పంచులు అధికారులు కలిసి గ్రామ అభివృద్ధికి పాటుపడాలి

బెజ్జూర్,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎంపీడీఓ బీఎస్.ప్రవీణ్ కుమార్ మండలంలోని సర్పంచులు,కార్యదర్శులకు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచులు కార్యదర్శులు గ్రామాభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు.నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మొక్కలు పెరిగే విధంగా చూడాలని సూచించారు.అలాగే ఉపాధి హామీ పనులను గ్రామాల్లో ప్రారంభించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు.ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలని అన్నారు.వేసవికాలంలో మంచినీటి సమస్యలు రాకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్,ఏపీఓ రాజన్న,ఏఈ అభిలాష్,మండలంలోని సర్పంచులు,కార్యదర్శులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వేమనపల్లి, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2014-15 సంవత్సరం పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. తమకు విద్యబుద్దులు నేర్పి, దిశానిర్దేశం చేసిన గురువులు వామనరావు, గోపీచంద్, రాజాబాపు, చంద్రవాస్, శుభాస్, తుమ్మిడి భాస్కర్, లక్ష్మీనారాయణ, లక్ష్మినివాస్ ముందాడ గురువులను ఘనంగా శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.




## మెజారిటీ మండల సర్పంచుల ఫోరం మాదే

**జన్నారం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని మెజారిటీ సర్పంచులున్న ఫోరం తమదేనని జన్నారం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుదురే వెంకన్న తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్నారం మండలంలో ఉన్న 29 గ్రామపంచాయతీలకు గాను 21 మంది సర్పంచులు తమ ఫోరంలో ఉన్నారని అన్నారు. ఒక పార్టీకి సంబంధించి కేవలం ఎనిమిది మందిని పెట్టుకొని ఒక సర్పంచ్ ఫోరంను ఏర్పాటు చేసుకుని పత్రికా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. టిఆర్ఎస్ హయంలోనే గ్రామ పంచాయతీలకు సంబంధించి అన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దినేష్ పవర్, మాజీ సర్పంచ్‌లు నందు నాయక్, కుర్ర పోషం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతిలో చేరిన మాజీ కౌన్సిలర్ శివాని

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ 15వ వార్డ్ మాజీ కౌన్సిలర్ బింగి శివాని, తన భర్త బింగి శివ కిరణ్‌లు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బింగి శివ కిరణ్ మాట్లాడుతూ మంత్రి వివేక్ గెలుపు కోసం అడుగడుగునా పనిచేసిన క్యాతనపల్లి మాజీ కౌన్సిలర్, బింగి శివాని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బింగి శివ కిరణ్‌కు అదే పార్టీ నుంచి తీరని అవమానం ఎదురైందని, మున్సిపల్ ఎన్నికల వేళ తనకు అన్యాయం జరుగుతోందన్న అసంతృప్తితో వారు కాంగ్రెస్ పార్టీకి గుడ్బై చెప్పి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జాగృతిలో చేరినట్లు తెలిపారు. మంత్రి వివేక్ కన్నా ముందే కాంగ్రెస్ పార్టీలో చేరిన శివకిరణ్ సేవలకు పార్టీలో కనీస గుర్తింపూ లేకపోవడం, ఎన్నికల సమయంలో కీలక నేతలను పక్కన పెట్టే ధోరణిపై పార్టీ తీరే ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. వారితో పాటు పట్టణానికి చెందిన జంగంపల్లి మల్లయ్య, మరికొంత మంది యువకులు జాగృతిలో చేరారు.




# సంపూర్ణత అభియాన్ 2.0 లక్ష్యాలను సాధించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

సంపూర్ణత అభియాన్ 2.0 నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి నీతి అయోగ్ లో భాగంగా సంపూర్ణత అభియాన్ 2.0 క్రింద ఆకాంక్షిత బ్లాక్, జిల్లా కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాక్, ఆకాంక్షిత జిల్లా కార్యక్రమంలో భాగంగా జనవరి 28 నుండి ఏప్రిల్ 14 వరకు నిర్దేశిత లక్ష్యాల సాధనపై సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఆకాంక్షిత తిర్యాణి బ్లాక్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 6 నెలల నుండి 6 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీలలోని పిల్లల ఎత్తు, బరువు, కొలతలు క్రమం తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మౌలిక వసతులు



ఉండాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలలో బాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. పశువులకు పాదం, నోటి వ్యాధులపై టీకాలు వేయాలని తెలిపారు. ఆకాంక్షిత్ జిల్లా కార్యక్రమంలో భాగంగా పుట్టిన శిశువుల బరువులు నమోదు చేయాలని, క్షయ వ్యాధి, రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్స అందించాలని, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి పోషకాహారం అందించాలని తెలిపారు. గ్రామాల సర్పంచ్‌లను కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. సంపూర్ణత అభియాన్ 1.0 లో సాధించిన స్ఫూర్తితో ఈసారి మరింత విశ్వాసంతో జాతీయ అవార్డుల సాధనకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం సంపూర్ణత అభియాన్ 2.0 లోని అంశాలపై అందించే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సర్పంచ్ ఆనందరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసి నాయకులు

## ఫెన్సింగ్ గార్డ్ ఏర్పాటు చేయాలని వినతి

**కెరమెరి, జనవరి 2, ప్రభాతవార్త:**

కెరమెరి మండల కేంద్రంలోని కుమురం భీం ఆదివాసీ భవన్లో ఫెన్సింగ్ గార్డ్ ఏర్పాటు చేయాలని రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు పెందోర్ మోతిరాం, మెట్టపిప్రి సర్పంచ్ కొద్దు, నాయకులు ఆత్రం రాము, కుర్సెంగ దందు, కుడ్మెత జలీమ్ షా, ఆత్రం చందన్ షా, కుడ్మెత సోము, గంగారాం, జంగు తదితరులు ఉన్నారు.

## సర్పంచ్ సన్మానించిన ఈజీఎస్ సిబ్బంది

**కెరమెరి, జనవరి 2, ప్రభాతవార్త :**




ఈజీఎస్ అధికారులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాలువాతో సన్మానించారు. అనంతరం ఈజీఎస్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ కూలీ పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఐఖ్య నాయక్, అరవింద్, పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ వెంకన్న తదితరులు ఉన్నారు.

## రామకృష్ణాపూర్ సిహెచ్‌పి శివాలయంలో బాల్క సుమన్ పూజలు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**



పట్టణంలోని సిహెచ్‌పి ఆవరణలోని శివాలయంలో సోమవారం చెన్నూర్ మాజీ ఎం.ఎల్.ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి రామకృష్ణ పూజా కార్యక్రమాల అనంతరం సుమన్‌కు తీర్థ ప్రసాదాలతో పాటు వేద వచనములతో ఆశీర్వదించారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభ గోని సుదర్శన్, నాయకులు డాక్టర్ రాజా రమేష్, అలుగుల సత్తయ్య, మద్ది శంకర్ లక్కీరెడ్డి రాజిరెడ్డిలు పాల్గొన్నారు.



## కన్నుల పండుగగా నరనారాయణ స్వామి రథోత్సవం

**జన్నారం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

జన్నారం మండలం కలమడుగు గ్రామం లోని నరనారాయణ స్వామి దేవాలయంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తుల మధ్య రథోత్సవం కనుల పండువగా జరిగింది. నరనారాయణ స్వామి జాతర జనవరి 31న ప్రారంభమైంది. ఈ రోజు చివరి రోజు కావడంతో కలమడుగు చుట్టు పక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుండే పురోహితులు కాకేరి రాజ నరేంద్ర శర్మ స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండి వారు ఆనందంతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. చివరి ఘట్టంలో రథోత్సవం అత్యంత వైభవంగా భక్తుల జై శ్రీమన్నారాయణ నినాదాల మధ్య చూడ ముచ్చటగా జరిగింది.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోవాలక్ష్మి ఓటర్లను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జానకపూర్ కోదండ రామాలయంలో ఆలయ అర్చకుడు వినాయక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మునిసిపల్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు ఇప్ప నాగరాజు, చిలువేరు వెంకన్న, రాపర్తి రవీందర్, చిలుకూరి శైలజా రవి, మాజీ సర్పంచ్ సరస్వతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఎస్పీ వహిదుద్దీన్


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

# టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తాయి

**- కాగజ్‌నగర్ డీఎస్పి వహిదుద్దీన్**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయియని కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. సోమవారం తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సౌజన్యంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) కాగజ్‌నగర్‌లో సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష (టాలెంట్ టెస్ట్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ టాలెంట్ టెస్టులు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం క్వాలిటి కోఆర్డీనేటర్ మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందిస్తూ వారి భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. టాలెంట్ టెస్టను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యా శాఖ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ జాడి దేవాజీ,కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్‌లు టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జర్పుల లాలాజీ, కొట్టె రాజు, కోశాధికారి ఇస్లావత్ విజేష్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, దీని ద్వారా సాంఘికశాస్త్రంలోని అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. తెలుగు మీడియంలో పిఎం జడ్‌పిఎస్ఎస్ సిర్పూర్ (టి) విద్యార్థి జె అజయ్ ప్రథమ, జడ్‌పిఎస్ఎస్ రాస్పల్లి విద్యార్థి సిహెచ్ కార్తీక్ ద్వితీయ, జడ్‌పిఎస్ఎస్ వెంపల్లి విద్యార్థి జి అంజలి, జడ్‌పిఎస్ఎస్ జన్కపూర్ విద్యార్థి ఎన్ శ్రీకాంత్ తృతీయ బహుమతులు పొందినట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఆసిపాబాద్ విద్యార్థి అలీజా షాజీన్ ప్రథమ, తెలంగాణ మోడల్ స్కూల్ ఆసిపాబాద్ విద్యార్థి పల్లెర్ల వైష్ణవి, జడ్‌పిఎస్ఎస్ రెబ్బెన అగ్గు గంగన్న ద్వితీయ బహుమతులు, ఉర్దూ మీడియంలో పిఎం జడ్‌పిఎస్ఎస్ సిర్పూర్ (టి) విద్యార్థిని మదీహబాను ప్రథమ బహుమతి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిఎస్ఎస్ ఆరెగూడ ప్రధానోపాధ్యాయులు పి. చంద్రశేఖర్, జిహెచ్ఎస్ ఓల్డ్ ఇంఛార్జ ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టులో విద్యార్థిని ఎంపిక

**తాండూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.అమూల్య రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, పీడీ సాంబమూర్తి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలలో అమూల్య అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైదన్నారు. ఈ నెల 5 నుండి 8 తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలోని కుమ్మరపల్లి మండలంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలలో అమూల్య ఆడుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థిని పలువురు అభినందించారు.


ఎంపికైన విద్యార్థినితో హెచ్ఎం ఉమాదేవి, పిడి సాంబమూర్తి

# బడ్జెట్‌ను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

**తాండూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ను నిరసిస్తూ తాండూర్ మండల కేంద్రంలోని ఐబిలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారాం 2026 27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందన్నారు. ఇది ముమ్మాటికి ప్రజా, కార్మిక, కర్షక మధ్యతరగతి ప్రజల వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. బడ్జెట్ కు నిరసనగా ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన సాధారణ సమ్మెలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం నాన్నయ్య, జాడి శంకర్, జైనేని రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం

# క్యాతన్‌పల్లి పురపాలిక చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటాం: బాల్క సుమన్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

ఫిబ్రవరి 11న జరిగే పుర ఎన్నికల్లో క్యాతన్ పల్లి పుర పాలిక చైర్ పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని చెన్నూర్ మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, సీపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌లు అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ, సీపిఐ పార్టీల అభ్యర్థులు, నాయకులతో కలిసి పట్టణంలోని బి జోన్ సెంటర్, 3వ వార్డ్,17వ వార్డ్,18వ వార్డ్,19వ వార్డులలో ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని లాంచానంగా ప్రారంభించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తు పై, సీపిఐ పార్టీ అభ్యర్థుల కంకి కొడవలి గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బెదిరింపు రాజకీయాలతో అభ్యర్థులకు, కార్యకర్తలకు ఫోన్లు చేసి బయటపెట్టడం సరి కాదన్నారు. బీఆర్ఎస్, సీపీఐ పొత్తుతో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎర్ర జెండాలను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, సీపీఐ పోటీ చేసే స్థానాల్లో రెబెల్ అభ్యర్థుల పోటీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజా రమేష్, బిఆర్ఎస్ పార్టీ క్యాతనపల్లి మున్సిపాలిటీ ఇంచార్జ్ పల్లె భూమేష్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కుమార్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, ఏఐటీయూసి నాయకులు అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, జిలకర మహేష్, రేవెల్లి ఓదేలు, అలుగుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





# కెరీర్ ప్రణాళికతోనే ఉన్నత స్థానాలు సాధ్యం

**- పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ పెంచికల్ పేట్ ఉన్నత పాఠశాలలో జ్ఞానదీప్తి**

**- విద్యార్థులకు భవిష్యత్తు పై దిశానిర్దేశం చేసిన వైద్య, ఇంజనీరింగ్ నిపుణులు**

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 2 , ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్ పేట్ లో సోమవారం విద్యార్థులకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన నిపుణుల ద్వారా జ్ఞానదీప్తి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం చేశారు. ముఖ్యతిథులుగా హాజరైన డాక్టర్ తరుణ్ (ఎంబిబిఎస్, ఎంఎస్ జనరల్ సర్జన్), డాక్టర్ చైతన్య సాయి ( బిడిఎస్,ఎండిఎస్(ప్రోస్థోడాంటిక్స్ అండ్ ఇంప్లాంటాలజీ), సివిల్ ఇంజనీర్ సాయి, అభిషేక్ లు విద్యార్థులకు కెరీర్ ఎంపికపై అవగహన కల్పించారు. ఏ విభాగాన్ని ఎంచుకోవాలి, ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అవసరమైన నైపుణ్యాలు, కష్టపడి చదవాల్సిన విధానం, లక్ష్య సాధనపై స్పష్టత ఉండాలంటూ సూచనలు చేశారు. ఇంజనీరింగ్, మెడిసిన్ రంగాల్లో ఉన్న అవకాశాలు, సాంకేతిక నైపుణ్యాలు ప్రాధాన్యతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను ముందుగానే రచించుకొని, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే ఉన్నత స్థానాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, సంతోష్, ఉజ్వల, మోనిక, విజయ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నిపుణులను ఉపాధ్యాయ, విద్యార్థులు శాలువాలతో సత్కరించారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**సిర్పూర్ (టి), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రోజున షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి మ్మకు సంబంధించిన 52 చెక్కులను వివిధ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, డిటి బక్కయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోనవెల్లి సర్పంచ్ కంట్లం సంతోష్, ఉపసర్పంచ్ కేడిం సతీష్, లక్ష్మీపూర్ సర్పంచ్ పిప్రే రామదాస్, చింతకుంట సర్పంచ్ శత్రు నాయక్, చీలపల్లి సర్పంచ్ మానేపల్లి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# వేలాల గట్టు మల్లన్న జాతర వేలం పాట

**జైపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఫిబ్రవరి 15న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొబ్బరి కాయలు, మరమరాలు విక్రాయించుటకు, వాహనాల పార్కింగ్ నిర్వహణ కొరకు సోమవారం సర్పంచ్ డేగ స్వప్న నగేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. మొదట కొబ్బరికాయల వేలంపాట నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు నాలుగు లక్షల రూపాయలకు జక్కం భాస్కర్, వేలంపాటను దక్కించుకొన్నారు. మరమరాలు (బోల్ పేలాలు) కొరకు, పార్కింగ్‌ల కొరకు వేలంపాట నిర్వహించగా, ప్రభుత్వ కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నది. పార్కింగ్ మరమరాలు (బోల్ పేలాలు) కొరకు నిర్వహించిన వేలంపాటలలో ప్రభుత్వ కనీస మద్దతు ధర కన్నా ఎవరు ఎక్కువ పాడక పోవడంతో రేపు బుధవారంనాడు వేలం పాట నిర్వహించేందుకు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఎస్ఐ రాజశేఖర్, ఉప సర్పంచ్ సుందిళ్ల రాయలింగు, ఆలయ ఈఓ బి.రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాకేష్, వార్డు సభ్యులు, వేలం పాటదారులు గ్రామ ప్రజలు హాజరైనారు.

## అభయాంజనేయుడి వార్షికోత్సవంను జయప్రదం చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పట్టణంలోని 41 ఆడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గం.కు స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవగ్రహ స్థాపన పూజలు, హవనం, పూర్ణాహుతి ఉంటుందన్నారు. అనంతరం 10.30కు మహా ప్రసాదం(అన్నదానం) వితరణ నిర్వహించబడుతుందని, భక్తులు పాల్గొని ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు కోరారు.

## పర్యావరణంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత**

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అనిత సూచించారు. సోమవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా లక్షెటిపేట పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలల విద్యార్థులకు సోమవారం వెంకట్రావుపేట గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద వివిధ అంశాలపై వారు అవగాహన కల్పించారు. చిత్తడి నేలల ప్రాముఖ్యత, వాటి ఆవాసం, వలస పక్షుల గురించి బైనాక్యులర్, స్పాటింగ్ స్కోప్ ద్వారా చూపిస్తూ వివరించారు. మనిషి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ వనరులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సాగరిక, చంద్రశేఖర్, ఎఫ్‌బిఓ ప్రసాద్, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# అటవీ పునరుద్ధరణే సర్కారు లక్ష్యం

**- కర్జవెల్లి రేంజ్‌ను తనిఖీ చేసిన అటవీ అధికారులు**



అటవీ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు నీరజ్ కుమార్ టిబ్రేవాల్, అప్పయ్య



మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అటవీ అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు కావాలని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. కర్జవెల్లి రేంజ్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నర్సరీల నిర్వహణ, భూమి పునరుద్ధరణ పనులను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత బాలాజీ అనుకోడ, గంగాపూర్, కర్జవెల్లి సెక్షన్ల పరిధిలోని నర్సరీలను సందర్శించారు. అక్కడ పెరుగుతున్న వివిధ రకాల మొక్కల ఆరోగ్యం, నీటి సరఫరా మరియు సంరక్షణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రాబోయే వానాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని, ప్రతి మొక్కా శాస్త్రీయ పద్ధతిలో పెరిగేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. దిందా. బండేపల్లి ప్రాంతాల్లో చేపట్టిన భూమి పునరుద్ధరణ పనులను డీఎఫ్‌వో పరిశీలించారు. గతంలో ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకుని, తిరిగి వాటిని పచ్చని అడవిగా మార్చేందుకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. దిందా ప్లాంటేషన్‌లో కొనసాగుతున్న అడ్వాన్స్ వర్క్స్, సోలార్ పిన్సింగ్ పనుల పై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు నాణ్యంగా ఉండాలని ఆదేశించారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అటవీ సంపదను కాపాడటంలో రాజీ పడొద్దని సిబ్బందితో అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ అటవీ శాఖ డివిజనల్ అధికారి అప్పయ్య, కర్జవెల్లి రేంజ్ అధికారి సుభాష్, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, అటవీ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



నూతన ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత

## వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

**- మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత**

**- 71 మంది నూతన సిబ్బందికి విధి నిర్వహణపై అవగాహన**

**నస్పూర్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం కొత్తగా నియమింపబడిన 71 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు ఆమె ఆధ్వర్యంలో శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్‌కు పంపే రక్త నమూనాలను సరైన సమయంలో, నిర్ణీత మోతాదులో సేకరించాలని, రోగి పేరు, ఫోన్ నంబర్, చిరునామా వివరాలను రిజిస్టర్లతో పాటు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, సకాలంలో నమూనాలను టీహబ్‌కు పంపితే సాయంత్రం కల్లా రోగికి, వైద్యుడికి వాట్సాప్ ద్వారా ఫలితాలు అందుతాయని, వైద్యులు సూచించిన పరీక్షలు మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శాస్త్రీయ పద్ధతిలో వాటిని నిర్వీర్యం చేయాలని అన్నారు. మలేరియా, డెంగ్యూ, గర్భవతుల పరీక్షలకు సంబంధించిన రాపిడ్ కిట్లను నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గర్భవతులకు చేసే పరీక్షలు, సికిల్ సెల్ రక్త నమూనాల సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, క్షయ నియంత్రణలో ల్యాబ్ పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధాకర్ నాయక్, టీ హబ్ మేనేజర్ వెంకటేష్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ పాల్గొన్నారు. సిహెచ్‌ఓలు వెంకటేశ్వర్లు, నామ్ దేవ్, అధికారులు శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, పద్మ మార్త, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ హాజరయ్యారు.

## ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి: కార్మిక సంఘాల ఐక్యవేదిక

**నస్పూర్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి మరణ శాసనాలు అని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఐఎఫ్టీయూ, టీఎస్‌యూఎస్, ఏఐఎఫ్టీయూ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, టీఎస్‌యూఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. పోషమల్లు మాట్లాడుతూ, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపునిచ్చారు. వంద ఏళ్ల పోరాట ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని, ఈ కొత్త కోడ్‌ల వల్ల కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు ఉండదని, సమ్మె చేసే స్వేచ్ఛను కేంద్రం కాలరాస్తోందని పేర్కొంన్నారు. శాశ్వత ఉద్యోగాల స్థానంలో పరిమిత కాల ఉద్యోగాలను నియమించడం వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతుందని, పరిశ్రమల మూత, లే ఆఫ్ నిబంధనలకు వర్తించే కార్మికుల సంఖ్యను 100 నుండి 300కు పెంచారని, దీనివల్ల దేశంలోని 80 శాతం చిన్న పరిశ్రమల కార్మికులకు చట్టపరమైన రక్షణ లభించదని అన్నారు. సింగరేణిలో కొత్త బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను ఐక్యవేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సంస్థ పరిరక్షణ కోసం ప్రతి కార్మికుడు సమ్మెలో భాగస్వామి కావాలని, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారాలను కుదించి యాజమాన్యాలకు మేలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ నాయకులు బ్రహ్మానందం, తాళ్లపల్లి శ్రీనివాస్, కిష్టన్న, భీముని పోషం, తిరుపతిరెడ్డి, శేఖర్, టీఎస్‌యూఎస్ నాయకులు సమ్ము రాజన్న, గజ్జల రామ్ నాథ్, గజ్జల రాజశేఖర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు